ఈ వారం తెలుగు పుస్తకం

# వి.యస్. రమాదేవి సృష్టించిన నవలా చతురస్రం

## ("రాజీ", "మలుపులు", "మజిలీ", "అనంతం")

అంపశయ్య నవీన్




Title: Razi
Author: V.S.Rama Devi
Subject: NOVELS
Year of Publication: 2004
Price: USD $ 2.77

మొన్న మొన్నటి దాకా వి.యస్.రమాదేవిగారు ఓ నవలాకారిణిగా తెలుగు పాఠకులకు తెలియదు. మొదట హిమాచల్ ప్రదేశ్‌కు, తర్వాత కర్ణాటకకు గవర్నర్‌గా పని చేసిన ఓ ఉన్నతాధికారిగానే ఆమె తెలుగువాళ్ళకు తెలుసు. కర్ణాటక గవర్నర్‌గా ఆమె పదవీవిరమణ చేశాక ఒకేసారిగా ఆమె రచించిన 15 పుస్తకాల్ని వెలువరించి తెలుగు పాఠకలోకంలో సంచలనం సృష్టించారు - ఈ 15 పుస్తకాల్లో 6 నవలలు, మూడు కథా సంకలనాలు, ఒక నాటికల సంకలనం, మూడు వ్యాస సంకలనాలు ఉన్నాయి. రచయిత్రిగా వి.ఎస్.రమాదేవి గారి విశ్వరూపాన్ని ఆమె ఒకేసారి వెలువరించిన ఈ గ్రంథాల్లో మనం దర్శించవచ్చు. ఈ గ్రంథాలన్నీ వెలువడక పూర్వం కూడా రమాదేవిగారొక నవల రాశారనీ, ఈ నవలలో ఆమె 1975 నాటి ఎమర్జెన్సీలో జరిగిన ఆనాటి కేంద్ర ప్రభుత్వ దురాగతాలను చిత్రించిందనీ మిత్రుడు శ్రీపతి చెబుతూండేవాడు.

కానీ ఈ నవల ఎవరికీ లభించలేదు. నేను కూడా 1975 నాటి ఎమర్జెన్సీని చిత్రిస్తూ "చీకటి రోజులు" అనే నవల రాశాను. ఎమర్జెన్సీ నాటి పరిస్థితుల్ని చిత్రిస్తూ వెలువడిన నవల ఇదొక్కటేనని కొందరు మిత్రులు అన్నప్పడల్లా రమాదేవి గారు కూడా ఈ ఇతివృత్తంతో ఒక నవల రాశారని శ్రీపతి చెప్పిన విషయం నాకు గుర్తొస్తుండేది. "కానీ ఆ నవల లభించడం లేదే"! అన్న బాధ కూడా కల్గుతుండేది. ఇంతకాలానికి "రాజీ" అన్న పేరుతో వెలువడిన ఆ నవల లభించడం, దాన్ని చదివే అవకాశం తెలుగు పాఠకులకు కల్గటం చాలా ముదావహం.

ఈ నవలకు 'ఒక్కమాట' అన్న పేరుతో ఓ ముందుమాట రాస్తూ రమాదేవిగారు ఇలా అన్నారు :

"దాదాపు నలభైఏళ్ళ తర్వాత హైదరాబాద్ తిరిగి వచ్చినప్పడు శ్రీపతిగారు కలిసి 'రాజీ' నవలను తిరిగి అచ్చు వేయించండి" అన్నారు. నాకు ఆశ్చర్యమేసింది. "మీకెలా తెలుసు అది నేను రాశాన"ని అనడిగాను. ఎమెస్కో ఎమ్.ఎన్.రావు గారి దగ్గర ఆ రోజుల్లో మీ వ్రాత ప్రతిని చూశాను. అది మీరు వ్రాశారని చెప్పారు" అని ఆయనన్నారు. అది నిజమే. స్వతంత్రభారతదేశాన్ని ఒకనాడు ఒక ఊపు ఊపిన రాజకీయ పరిణామం "ఎమర్జెన్సీ". ఆ పూర్వరంగంగా

1979లో వ్రాసిన నవల అది. "ఎందుకయినా మంచిది. దానిని కలం పేరుతో అచ్చువేయించండి అంటూ సలహా ఇచ్చారు, మా సెక్రటరీ పేరిశాస్త్రిగారు. అందువల్ల ఆ నవలనప్పుడు "నిశ" అనే కలం పేరుతో అచ్చువేశారు. ఆ కలం పేరుతోనే అడపాదడపా నా కరిగిపోయే కలలు వివిధ మాగజైన్స్‌లో అచ్చవుతూ ఉండేవి".

ఆనాడు "నిశ" రాసిన నవలగా వెలువడిన ఈ "రాజీ" మళ్ళీ ఇన్నాళ్ళకు వి.ఎస్.రమాదేవిగారి స్వంత పేరుతోటే పాఠకుల ముందుకొచ్చింది.

అయితే "రాజీ" నవలకు సీక్వెల్స్‌గా అంటే కొనసాగింపుగా రమాదేవిగారు మరో మూడు నవలలు రాశారు. అవి 'మలుపులు', 'మజిలి', 'అనంతం'. ఇంత వరకు నవలా సాహిత్యంలో ఒకదానికొకటి కొనసాగింపుగా మూడు నవలలు వెలువడ్తుండేవి. ఆ మూడింటిని కలిపి 'నవలాత్రయం' (Trilogy) అని అంటుండేవాళ్ళు. ఈ నవలల్లోని ప్రధాన పాత్ర పేరుతో ఈ మూడు నవలల్ని ఫలానా త్రయనవలలు అని కూడా అంటారు. ఉదాహరణకు నేను రాసిన 'అంపశయ్య', 'ముళ్ళపొదలు', 'అంతస్స్రవంతి' అన్న మూడు నవలల్నీ కలిపి "రవిత్రయ నవలలు" అన్నారు (Ravitrilogy). ఇప్పుడు రమాదేవిగారు ఒకదానికొకటి కొనసాగింపుగా నాల్గు నవలల్ని రచించారు. ఈ నాల్గు నవలల్లోనూ ప్రధాన పాత్ర "రాజేశ్వరి" రాజేశ్వరినే 'రాజీ' అని కూడా రచయిత్రి సంబోధిస్తారు. అందుకే ఈ నాల్గు నవలల్లో మొదటి నవలకు "రాజీ" అన్న పేరు పెట్టారు. ఇవి నాలుగు నవలలు కాబట్టి వీటిని నవలా చతుష్టయం అని పిలవొచ్చు. "చతుష్టయం" అన్న మాట రచయిత్రికి నచ్చలేదేమో, 'నవలా చతురస్రం' అన్నారు. ఈ నాల్గు నవలల్లోనూ ప్రధానపాత్ర రాజేశ్వరే కాబట్టి వీటిని "రాజీ నవలా చతురస్రం" అనో లేక "రాజేశ్వరి నవలా చతురస్రం" అనో వీటికి పేరుపెట్టొచ్చు.

ఇదివరకటి తెలుగు నవలల్లో చాలా వరకు మధ్య తరగతి కుటుంబాల చిత్రణే ఎక్కువగా జరిగింది. దానిక్కారణం నవలలు రాసే రచయితలందరూ మధ్యతరగతి కుటుంబాలనుండి వచ్చినవాళ్ళే కావడం. ఇటీవలికాలంలో నిమ్నవర్గాలనుండి కూడా నవలలు రాసే రచయితలు రావడం వల్ల ఈ పరిస్థితి మారింది. సమాజంలోని అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజల జీవిత చిత్రణ కూడా ఇవ్వాళ్టి నవలల్లో దర్శనమిస్తున్నది. కానీ సమాజంలోని ఉన్నతవర్గాలను గూర్చిన రచనలు - ముఖ్యంగా డిల్లీ లాంటి మహా పట్టణంలో ఐ.ఏ.ఎస్., ఐ.పీ.ఎస్ లాంటి ఉన్నతోద్యోగాలు చేస్తున్న వాళ్ళ జీవితచిత్రణ మన నవలల్లో చాలా తక్కువగానే జరుగుతున్నది. దానిక్కారణం : ఈ వర్గాలకు చెందినవాళ్ళు నవలలు రాయకపోవడమే - ఈ కొరతను తీర్చడానికా అన్నట్టు రమాదేవిగారు ఈ నవలాచతురస్రాన్ని రచించి ప్రచురించారు.

వి.ఎస్.రమాదేవి డిల్లీలాంటి మహాపట్టణంలో ఉద్యోగరీత్యా చాలా కాలం నివసించింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన శాఖల్లో ఉద్యోగినిగా పనిచేసింది. పదోన్నతిని పొందుతూ రాజ్యసభ సెక్రటరీజనరల్‌గా ఆ తర్వాత రెండు రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసింది. డిల్లీలో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో ఎంతోమంది ఉన్నతాధికారులతో ఆమెకు పరిచయం కల్గింది. ఈ ఉన్నతాధికారుల పనితీరు, జీవనశైలి ఎలా ఉంటాయో పరిశీలించే అవకాశం ఆమెకు కల్గింది. రాజ్యసభకు సెక్రటరీజనరల్‌గా పనిచెయ్యడం వల్ల ఆమెకు అనేకమంది పార్లమెంట్ మెంబర్లను కూడా పరిశీలించే అవకాశం కల్గింది. డిల్లీనగరంలో జరిగే రాజకీయాలు, పైరవీలు, లాబీయింగులు మొదలైనవి ఎలా ఎలా ఉంటాయో, అవి యే స్థాయుల్లో జరుగుతాయో ఆమెకు తెలుసు - స్వయంగా రచయిత్రి కావడం వల్ల ఆమె తన ఈ అనుభవాలన్నింటినీ ఈ నవలలుగా రూపొందించగల్గింది.

రమాదేవి వ్యక్తిగత జీవితానికీ ఈ నాల్గు నవలల్లోని ప్రధాన పాత్ర రాజేశ్వరికీ కొన్ని పోలికలుండటంవల్ల ఈ నవలల్ని ఆమె ఆత్మకథాత్మక నవలలనుకునే అవకాశం ఉంది. కానీ ఇవి తన ఆత్మకథాత్మక నవలలు కావని రమాదేవిగారు చాలా స్పష్టంగా  ఒక్కమాటలో చెప్పారు.

"చివరగా ఒక సంగతి. ఈ నవలలను చదివిన వారు ఇది "ఆత్మకథ కాదు కదా?" అని అనుకునే అవకాశం లేకపోలేదు.

నా మొట్టమొదటి కథ 1951లో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో అచ్చయింది. ఆనాటి నా స్నేహితులు కలిసినప్పుడు ఇప్పటికీ నాకు గుర్తు చేస్తుంటారు. "అది మీ ఇంటిముందు గుడిసె వేసుకుని జీవిస్తూ ఉండిన ఎరుకల వాళ్ళను దృష్టిలో పెట్టుకొని వ్రాసిన కథ కదా" అంటూ. ఇదెందుకు చెబుతున్నానంటే నాకు తెలిసిన వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని, అనుభవాల నేపథ్యంలో, ఇతివృత్తాన్ని మలచి పాత్రలను కల్పించి వ్రాయడం నా అలవాటు. ఈ నవలలు కూడా అలా వ్రాసినవే" అంటారు రమాదేవిగారు.

ఈ నవలా చతురస్రంలోని మొదటి నవల "రాజీ". ఈ నవలలో 1975లో ఆనాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధి విధించిన అత్యవసరపరిస్థితి కారణంగా ఏర్పడిన సంక్షోభస్థితిని రచయిత్రి చిత్రించింది.

కేంద్ర ప్రభుత్వ సంగీత నృత్య విభాగంలో సంగీత కళాకారిణిగా ఉద్యోగంలో చేరిన రాజేశ్వరి ఎదుర్కొన్న అనేక సమస్యల చిత్రణే 'రాజీ' నవల. నవల ప్రారంభంలో రాజేశ్వరికి ఉన్నతోద్యోగంలో ఇద్దరు వ్యక్తులతో ఏర్పడిన సన్నిహిత సంబంధాన్ని రచయిత్రి సున్నితంగా చిత్రించింది- ఆ ఇద్దర్లో ఒకరు అనంత్, మరొకరు రవికాంత్. ఈ ఇద్దరిలో అనంత్ రాజేశ్వరిని ప్రేమిస్తాడు. నవల రెండో భాగంలో దేశంమీద విధించబడిన అత్యవసర పరిస్థితి ప్రజల ప్రాథమిక హక్కుల్ని ఎలా కాలరాచి వేసిందో రచయిత్రి చూపించింది. అత్యవసర పరిస్థితి సృష్టించిన బీభత్సంలో రాజేశ్వరిలాంటి ఓ అమాయకురాలు చిక్కుకొని ఎన్నో అవమానాలకు, అవస్థలకూ గురవుతుంది. నవల చివర్లో రాజేశ్వరి హిమాలయ పర్వత సానువుల్లోని డెహ్రాడూన్‌లో ఉన్న స్వామీజీ ఆశ్రమాన్ని చేరుకుంటుంది. అక్కడి పవిత్రక్షేత్రాలు, ప్రకృతి సౌందర్యం, నిర్మలజీవనం రాజీకి ప్రశాంతతను చేకూరుస్తాయి. అనంత్‌కు రాజీ రాసిన ఒక ఉత్తరంతో "రాజీ" నవల పూర్తవుతుంది. కొండకోనల్లో తిరగడానికనువైన ఆ ఉద్యోగం వెంటనే నాకిప్పించండి" అంటూ ఆ ఉత్తరంలో రాజీ అనంత్‌ను వేడుకుంటుంది.

ఆధునిక భారతదేశ చరిత్రలో 1975-78 మధ్య కాలానికి ఒక ప్రత్యేకత ఉంది. ఆనాడు దేశానికి ప్రధానమంత్రిగా ఉన్న శ్రీమతి ఇందిరాగాంధీ కేవలం తన పదవిని కాపాడుకోవడం కోసం 1975లో దేశం మీద అత్యవసర పరిస్థితిని విధించింది. ప్రజలకు రాజ్యాంగం ద్వారా సమకూరిన ప్రాథమిక హక్కుల్ని రద్దుచేసింది. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన పత్రికా స్వాతంత్ర్యాన్ని, వాక్ స్వాతంత్ర్యాన్ని మంటగలిపింది. యే పాపం ఎరుగని ఎందరో అమాయకుల్ని పోలీసులు అరెస్టు చేసి పోలీసుక్యాంపుల్లో నిర్బంధించారు. హింసించారు. 1977లో జరిగిన ఎన్నికల్లో ఇందిరాగాంధీ ఓడిపోవడంతో అత్యవసర పరిస్థితిని తొలగించారు. ఆ తర్వాత అత్యవసర పరిస్థితిలో జరిగిన ప్రభుత్వ దురాగతాలను వివరిస్తూ ఎన్నో గ్రంథాలు వెలువడ్డాయి. అయితే ఈ పరిస్థితుల్ని చిత్రిస్తూ వెలువడిన నవలలు మాత్రం తక్కువే. అలాంటి బహు కొద్ది నవలల్లో ఈ "రాజీ" ఒకటి. అత్యవసర పరిస్థితిని విధించక ముందు ఢిల్లీలోని ఉన్నతోద్యోగ వర్గాల్లో ఉన్న స్వేచ్ఛాయుత వాతావరణానికి, ఆ తర్వాత నెలకొన్న భయానక వాతావరణానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని రమాదేవిగారు తన 'రాజీ' నవలలో సమర్థవంతంగా చిత్రించారు.

రాజీకి అంటే రాజేశ్వరికి అనేకమంది ఉన్నతాధికారులతో పరిచయమేర్పడటం, కొందరితో ఆ పరిచయం స్నేహంగా మారడం, వివిధ దశల్లో ఆమె పొందిన అనుభూతులు, స్త్రీగా కొందరి చేతుల్లో పడి ఆమె అనుభవించిన శారీరక, మానసిక హింస - వీటిని ఈ నవలలో మనం దర్శిస్తాం.

అనేక మంది ఉన్నతాధికారుల మధ్యలో మసలుతూ ఉద్యోగం చేస్తున్న ఓ అందమైన యువతి తనే తప్పు చెయ్యకపోయినా కేవలం స్త్రీకావడం - అందులో అందమైన స్త్రీ కావడం వల్ల ఎన్ని బాధలు పడ్తుందో, ఎంత వేదనను అనుభవిస్తుందో ఈ నవలలో రచయిత్రి చిత్రించిన విధానం పాఠకుల హృదయాలకు హత్తుకుంటుంది.

డిల్లీలాంటి మహానగరంలో పనిచేస్తున్న అవివాహితురాలైన రాజేశ్వరికి అనంత్ అనే తన విభాగంలోనే పనిచేస్తున్న ఉన్నతాధికారితో పరిచయమేర్పడుతుంది. ఇద్దరూ తెలుగువాళ్ళే కావడం వల్ల త్వరలోనే వాళ్ళమధ్య సాన్నిహిత్యం ఏర్పడుతుంది. ఫ్లూ జ్వరంతో బాధపడుతున్న రాజీని అనంత్ హాస్పటల్లో చేర్పిస్తాడు. అలా వాళ్ళిద్దరు చాలా దగ్గరవుతున్న తరుణంలో రాజీ వాళ్ళ సంబంధాన్ని సెక్స్‌తో సంబంధంలేని స్నేహంగానే భావిస్తుంది. కానీ ఒక రోజు అనంత్ ఆమెతో సెక్స్ సంబంధాన్ని కోర్తాడు. ఆమె కాదనలేకపోతుంది. ఈ సంఘటన తర్వాత రాజీ అనంత్ కూడా స్త్రీ నుండి సెక్స్ సుఖాన్ని మాత్రమే ఆశించే అందరి పురుషుల్లాంటి వాడేననుకుంటుంది. అతనికి దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తుంది. కానీ అనంత్ ఆమెకు దగ్గరవుతూనే ఉంటాడు. తన పట్ల అతనికున్న ఆరాధనాభావం రాజీని వశపరచుకుంటుంది.

సంగీతంలో శిక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం వారే రాజీని లండన్‌కు పంపిస్తారు. అక్కడ పురుషులు స్త్రీలతో ప్రవర్తించే తీరు, అక్కడుండే సెక్స్‌స్వేచ్ఛ ఆమెను షాక్ చేస్తుంది. ఆమెతో బాటే సంగీతంలో శిక్షణ కోసం కరేబియన్ దీవుల నుండి లండన్ వచ్చిన జేమ్స్ అనే నీగ్రోయువకుడు ఆమె అందాన్ని చూసి ఆమెను వెంటాడుతుంటాడు. ప్రేమలేకపోయినా సెక్స్ సుఖం కోసం స్త్రీ పురుషులు ఓ రాత్రి ఒకరి పక్కలో ఒకరు పడుకుంటే తప్పేమిటని అతడు ఆమెతో వాదిస్తుంటాడు. ఆమె అతనితో అలా పడుకోవడానికి అంగీకరించకపోవడంతో అతడామెను బలవంతంగానైనా అనుభవించాలని నిర్ణయించుకుంటాడు. అతన్నుండి ఆమె ఎంత తప్పించుకొని తిరిగినా, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఓ రాత్రి అతడామె గదికొచ్చి ఆమెను రేప్ చేస్తాడు. అతన్నుండి తప్పించుకోలేని నిస్సహాయురాలిగా మారిపోయిన ఆమె ఆక్షణాల్లో ఎంత హింసను అనుభవిస్తుందో రచయిత్రి చిత్రించింది. ఆమె లండన్ నుండి తిరిగొచ్చిన కొద్దిరోజుల తర్వాత దేశంలో అత్యవసర పరిస్థితిని విధిస్తారు. రవికాంత్ అనే పార్లమెంట్ మెంబర్‌ద్వారా ఆమెకు డా॥ కరుణాకర్ అనే డాక్టర్ పరిచయమవుతాడు. ఈ డా॥ కరుణాకర్‌కు అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఓ రాజకీయ పార్టీతో సంబంధం ఉంటుంది. రాజీకి డా॥ కరుణాకర్‌తో సంబంధం ఉందని పసిగట్టిన పోలీసు ఇంటెలిజెన్స్ విభాగం వారు రాజీ వెంట పడ్తారు. డా॥ కరుణాకర్ ఇప్పుడెక్కడున్నాడో చెప్పమని రాజీని వేధిస్తారు. ఇంటరాగేషన్ చేస్తూ అవమానిస్తారు. రాజీవాళ్ళ మామయ్య ఒకాయన సర్వోదయ ఉద్యమంలో ఉండటం కూడా ఆమెకు శాపంగా మారుతుంది. అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పోరాడుతున్న జయప్రకాష్ నారాయణ్ సర్వోదయ ఉద్యమానికి చెందిన వాడు కదా! పోలీసాఫీసర్లు ఆమెను తాము చెప్పినట్టుగా నల్గురిఎదుటా చెప్పాలని బలవంతం చేస్తారు. అందుకామె అంగీకరించక పోవడంతో ఆమెకు అనెస్తేషియా ఇచ్చి పెళ్ళికాని ఆమెకు ట్యుబెక్టమీ ఆపరేషన్ చేస్తారు. ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆమె రాసిచ్చినట్టుగా ఓ స్టేట్‌మెంటును తయారు చేస్తారు. దీని ఆధారంతో ఆమెను పోలీసు క్యాంపులో బంధిస్తారు. ఆ క్యాంపులో పోలీసులు ఎందరో అమాయక ప్రజల్ని బంధించి వాళ్ళను ఎన్నో చిత్రహింసలకు గురిచెయ్యడాన్ని ప్రత్యక్షంగా చూస్తూ రాజీ భయంకరమైన మానసిక హింసకు గురవుతుంది. ఎందరో ఉన్నతాధికారులతో పరిచయమున్న ఆమెను ఈ హింస నుండి, నిర్బంధం నుండి ఎవరూ రక్షించలేకపోతారు - అనంత్ లాంటి ఆమెనెంతో ప్రేమించే, ఆరాధించే ఉన్నతాధికారి కూడా ఆమెనాక్షణంలో ఆదుకోలేకపోతాడు. అత్యవసర పరిస్థితిలో దేశ పరిస్థితి ఎంత దిగజారిపోయిందో, ఒక అమాయకురాలైన స్త్రీ ఎంత వేదనకు, ఎన్ని అవమానాలకు గురయిందో ఈ నవలలోని ఈ ఘట్టంలో రచయిత్రి బలంగా చిత్రించింది.

అత్యవసర పరిస్థితిని తొలగించాక ఆమె ఉద్యోగానికి రాజీనామా చేసి హిమాలయ పర్వత సానువుల్లో ఉన్న ఓ స్వామీజీ ఆశ్రమాన్ని చేరుకుంటుంది. అక్కడి ప్రశాంతత ఆమె మనస్సుకు స్వాంతనను చేకూర్చిందని చెబుతూ రమాదేవి గారు ఈ నవలను ముగించారు.

రాజీకి కొనసాగింపుగా ప్రారంభమైన 'మలుపులు' నవల రాజీ, తనుకోరుకున్న కొండల్లో, కోనల్లో తిరగడానికనువైన ఉద్యోగంలో చేరడంతో ప్రారంభమౌతుంది. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌కు ఆంతరంగిక సెక్రటరీగా నియమించబడిన

రాజేశ్వరి సిమ్లాకు ప్రయాణం చేస్తూ గత స్మృతుల్లోకెళ్ళి పోతుంది. అలా ఈ నవలంతా ఫ్లాష్‌బాక్ రూపంలో చెప్పబడింది. ఆమెకెంతో సన్నిహితుడైన అనంత్ ఓ విమాన దుర్ఘటనలో చనిపోయాడన్న వార్త ఆమెను దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. కానీ ఆ షాక్ నుండి "మరణించిన వారితో పాటు కాలం స్తంభించిపోదు" అన్న జ్ఞానంతో త్వరలోనే కోలుకుంటుంది. ఈ లోగా డిల్లీలో అనేక మార్పులు జరుగుతాయి. ప్రధాన మంత్రులు మారిపోతుంటారు. 1977లో అత్యవసర పరిస్థితి తొలగించబడటం, అంతకుముందు పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో శ్రీమతి ఇందిరా గాంధి ఘోర పరాజయం పొందటం, మొదటిసారిగా కేంద్రంలో కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడటం, కానీ త్వరలోనే ఆనాటి జనతాపార్టీలో ముసలం పుట్టడం, ప్రధాన మంత్రిగా మొరార్జీదేశాయి రాజీనామా చెయ్యడం, చరణ్ సింగ్‌కు ఇందిరాగాంధీ మద్దతు ప్రకటించడం, దాంతో ఆయన ప్రధాన మంత్రి కావడం, త్వరలోనే ఆయనకు ఇందిరాగాంధీ పార్టీ మద్దతును ఉపసంహరించుకోవడంతో ఆయన ఒక్క రోజు కూడా పార్లమెంట్‌లో కూర్చోకుండానే రాజీనామా చెయ్యడం, ఆతర్వాత జరిగిన ఎన్నికల్లో ఇందిరాగాంధీ గొప్ప విజయాన్ని సాధించి తిరిగి ప్రధాని పదవిని చేపట్టటం, ఆమె ఈ విజయాన్ని సాధించిన కొద్దిరోజుల్లోనే ఆమె చిన్న కొడుకు ఓ విమాన దుర్ఘటనలో చనిపోవడం - ఈ సంఘటనల నేపథ్యంలో రాజేశ్వరి పొందిన అనుభవాలు - ఇదీ 'మలుపులు' నవల ఇతివృత్తం.

రాజేశ్వరి రవికాంత్ (ఈయన రాజ్యసభ సభ్యుడు సహాయంతో) రాజ్యసభ కార్యాలయంలో పనిచెయ్యడం ప్రారంభిస్తుంది. పార్లమెంట్‌కు సంబంధించిన అన్ని విషయాలను ఆమె తెలుసుకుంటుంది. వివిధ పార్టీల మధ్య జరిగే వాద ప్రతివాదాలు, ఎం.పీల ద్వారా జరిగే పైరవీలు, ఐ.ఏ.ఎస్., ఐ.పీ.ఎస్ ఆఫీసర్ల మధ్య ఉండే విభేధాలు మొదలైనవన్నీ ఆమెకర్థమౌతాయి. పార్లమెంట్‌లో ఒక సభ్యుడు ఒక మంత్రిని ప్రశ్న అడగడంలో ఉండే రహస్యమేమిటో ఆమెకు తెలుస్తుంది.

రాజేశ్వరి రాజ్యసభ సెక్రటేరియేట్‌లో పనిచేస్తున్న రోజుల్లో ఆమె దగ్గరకొక బాగా డబ్బున్న ఓ వ్యక్తి వచ్చి "చూడండి, నేనొక పెద్ద కంపెనీ పనులు చూస్తూ ఉంటాను. చూసారుగా నేనొచ్చిన కారు. అది కంపెనీదే. వాళ్ళు నాకు బంగళా, కారు అన్నీ ఇచ్చారు. మీరు కూడా ఆ కంపెనీ పనులు వీలును బట్టి చేస్తూ ఉంటే మీకు బాగా ముట్ట చెబుతారు" అంటాడు.

ఆమె చెయ్యాల్సిన పనులేమిటో కూడా అతడామెకు చెబుతాడు.

"అంటే ఏమీలేదు, మేమిచ్చే స్టార్డు ప్రశ్నలు వెలుగులోకి వచ్చేట్టు చెయ్యడం, అప్పుడప్పుడు మా తరఫున మీరే ప్రశ్నలు రాసి ఏ సభ్యుడితోనన్నా సంతకం పెట్టించడం... ఇలాంటి చిన్న చిన్న పనులే... దాని వల్ల మీకూ మాకూ కూడా ఉపయోగం" అంటాడతడు.

రాజేశ్వరి "గెటౌట్" అంటూ అతన్ని బయటికి పంపిస్తుంది.

ఈలోగా ఇందిరాగాంధీని ఆమె అంగరక్షకులే కాల్చి చంపడం, రాజీవ్‌గాంధీ ప్రధాన మంత్రి కావడం లాంటి సంఘటనలు జరుగుతాయి. ఐదేళ్ళు రాజీవ్ ప్రధానమంత్రిగా పనిచేశాక జరిగిన ఎన్నికల్లో ఆయన పార్టీ ఓడిపోవడం, మొదటిసారిగా డిల్లీలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటం, వీ.పి.సింగ్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టడం, ఓ సంవత్సరంలోనే అతని ప్రభుత్వం పడిపోవడం, తర్వాత చంద్రశేఖర్ ప్రధానమంత్రి పదవిని చేపట్టడం, అతని ప్రభుత్వం కూడా పడిపోవడం మొదలైన సంఘటనలన్నీ చకచకా జరిగిపోతాయి. ఈ సంఘటనలన్నీ ఒక వేపు జరుగుతుండగానే రాజేశ్వరికి చైనాకు వెళ్ళే అవకాశం లభిస్తుంది. చైనాలోని రాజకీయ వాతావరణాన్ని, అక్కడి కట్టడాల్ని, ప్రకృతిసౌందర్యాన్ని ఈ సందర్భంలో రచయిత్రి వర్ణిస్తుంది. ఆ తర్వాత రాజేశ్వరి అమెరికాకు వెళ్ళడం, మళ్ళీ అక్కడి వాతావరణం -ఇలా అనేక మలుపులు తిరిగిన ఈ నవల రాజేశ్వరి మూర్తి అనే హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌కు అంతరంగిక కార్యదర్శిగా నియమించబడటంతో ముగుస్తుంది- సిమ్లాకు వెళ్తున్న రాజేశ్వరి ఫ్లాష్‌బాక్‌తో ప్రారంభమైన ఈ నవల ఆమె సిమ్లా చేరుకోవడంతో

అంతమౌతుంది.

'మలుపులు'కు కొనసాగింపుగా రచించబడిన "మజిలీ" నవల రాజేశ్వరి హిమాచల్ ప్రదేశ్‌లోని రాజభవన్ గవర్నర్‌కు ఆంతరంగిక సెక్రటరీగా తన బాధ్యతల్ని చేపట్టడంతో ప్రారంభమౌతుంది.

హిమాచల్‌ప్రదేశ్ అంటే చుట్టూ హిమాలయపర్వతాలతో నిండిన ప్రాంతం. ఆ కొండకోనల్లో నివసించే ప్రజల జీవన విధానం, రాజ్‌భవన్‌లో నివసించే గవర్నర్‌గారు ఎదుర్కునే సమస్యలు, ఆయనకు ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేస్తున్న రాజేశ్వరి ఎదుర్కునే సమస్యలు - ఇవన్నీ ఈ "మజిలీ" నవలకు ఇతివృత్తం.

ఒక రాష్ట్రగవర్నర్‌కు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఉండే సంబంధాలు, రాజ్‌భవన్‌లో పనిచేసే సిబ్బంది విధులు, ప్రభుత్వ యంత్రాంగం పనిచేసే విధానం, పోలీసు వ్యవస్థ పనిచేసే విధానం ఈ నవలలో రచయిత్రి అత్యంత వాస్తవికంగా చిత్రించింది- గవర్నర్ వ్యవస్థలో అంతర్భాగంగా పనిచేసిన రమాదేవిగారు ఆ వ్యవస్థని నిశితంగా పరిశీలించిన ఫలితం ఈ నవలలో వ్యక్తమౌతుంది.

రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీలో మెజార్టీని కోల్పోవడం, ఎం.ఎల్.ఏలు పార్టీలు ఫిరాయించడం, ఆయారామ్‌లు, గయారామ్‌లు గవర్నర్ దగ్గరకొచ్చి నేను ఫలానా వారికి మద్దతిస్తున్నాననో, ఫలానా వారికి మద్దతు ఉపసంహరించుకున్నాననో చెప్పడం, ఇలాంటి పరిస్థితులేర్పడినప్పుడు గవర్నర్ ఎలాంటి ఇరకాటంలో పడిపోతాడో మొదలైన అంశాలన్నీ ఈ నవలలో చోటు చేసుకున్నాయి.

ఈ నవలలో గవర్నర్ మూర్తి భార్య పేరు వనజ. ఆమెకు ఒక యాక్సిడెంట్ కారణంగా అంగవైకల్యం ఏర్పడటం వల్ల చక్రాల కుర్చీకే అంకితమైపోతుంది. ఈ వనజకు, రాజేశ్వరికి మధ్య ఏర్పడే సంబంధాలు చాలా సున్నితంగా ఉంటాయి. వాళ్ళు దగ్గరవుతున్నట్టే అవుతూ దూరమౌతుంటారు. వనజ మంచి భావుకురాలు. ఆమె కవిత్వం రాస్తుంటుంది. ఆమె రాసిన ఈ కవిత్వం రాజేశ్వరికి నచ్చుతుంది. కానీ ఆమెమీద ఆమెకే నమ్మకం ఉండదు. యాక్సిడెంట్‌కు గురయి అంగవైకల్యాన్ని పొందటంతో ఆమెలోని ఆత్మ విశ్వాసం దెబ్బతిన్నది. అలాంటి వనజకు రాజేశ్వరి చేదోడు వాదోడుగా ఉంటూ ఆమెలోని సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ ఉంటుంది. ఇలా హిమాచల్‌ప్రదేశ్‌లోని రాజ్‌భవన్‌లో గడుపుతున్న రాజేశ్వరికి గవర్నర్ మూర్తిగార్ని హిమాచల్ ప్రదేశ్ నుండి కర్ణాటకకు బదిలీ చేశారని తెలుస్తుంది. రాజ్‌భవన్‌లో గవర్నర్‌గార్కి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి వీడ్కోలు చెప్పడంతో 'మజిలీ' నవల అయిపోయింది.

"ఒక మజిలీ అయింది. ఈ మజిలీలకు ముగింపు ఎప్పడో... వుంటుందా అసలు ముగింపు" అనుకుంటుంది రాజేశ్వరి.

సిమ్లానుంచి హెలికాప్టర్‌లో ఢిల్లీకి వచ్చి విమానాశ్రయంలో బెంగూళూర్ వెళ్లే విమానం కోసం గవర్నర్ మూర్తి కుటుంబంతో బాటు రాజేశ్వరి కూడా ఎదురు చూస్తున్న ఘట్టంతో ఈ నవలా చతురస్రంలోని నాల్గవ నవల 'అనంతం' ప్రారంభమౌతుంది. గవర్నర్‌మూర్తి తన సిబ్బందితో బెంగూళూర్ చేరుకోవడం, రాజ్‌భవన్‌లో గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చెయ్యడం, కర్ణాటక రాష్ట్ర రాజకీయాలను పరిశీలించడం, విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్స్‌ని ఎంపిక చెయ్యడంలో గవర్నర్ నిర్వహించే పాత్ర, గవర్నర్ చెయ్యగల్గే కొన్ని ప్రజాహిత కార్యక్రమాలు, ముఖ్యంగా సమాజంలోని అట్టడుగువర్గాలు నివసించే మురికివాడల్లో కొన్ని సౌకర్యాలు కల్పించడం, గవర్నర్‌గారి ఆంతరంగిక కార్యదర్శిగా రాజేశ్వరి తన విధుల్ని నిర్వహించడం, నిస్సహాయురాళ్లుగా మారిపోయిన తన తోటి స్త్రీలకెందరికో సహాయం చేసి రక్షించడం - ఇలాంటి సంఘటనలతో 'అనంతం' నవల సాగుతుంది.

గవర్నర్ మూర్తి పదవీకాలం ముగుస్తుంది. ఆయనా, ఆయన భార్య వనజ రాజ్‌భవన్ నుండి రాజేశ్వరి బెంగుళూరులో తన మామయ్య కోసం కట్టించిన ఇంట్లోకి మారిపోతారు. రాజేశ్వరి తిరిగి ఢిల్లీకి తన పూర్వపు ఉద్యోగం - రాజ్యసభ

సెక్రటేరియట్‌కి - వెళ్ళిపోతుంది. ఆమెకెంతో అండగా ఉండే రవికాంత్ ఆమెను ఢిల్లీకి పంపిస్తూ తనింకో ఐదారు నెలలకంటే ఎక్కువ కాలం బతకకపోవచ్చునని చెబుతాడు. (ఈ రవికాంత్ గవర్నర్ మూర్తిగారి బావ మరిదే) అతని ఆరోగ్యం క్షీణించిందని డాక్టర్లు చెబుతారు. రవికాంత్ రాజ్యసభ సభ్యుడు. అతడు రాజేశ్వరిని ఢిల్లీకి పంపిస్తూ చెప్పిన మాటలు పాఠకుల హృదయాలను ద్రవింపచేస్తాయి.

"రాజీ... శీతాకాలపు సమావేశాలకు వీలయితే వస్తాను...ఆరెనిమిది నెలలకన్నా, ఎక్కువెక్కువగా నాలుగు నెలలు మించి ఉండననుకుంటా... ఈ లోపున కమిటీ మీటింగులున్నాయి. కానీ రావాలని లేదు. వస్తే నిన్ను కడసారి చూడటానికే రావాలి. మరీ నీరసపడిపోయి శవాకారంలో నీకు కనబడటం ఇష్టంలేదు. నేను పైకి పోతున్నాను... రమ్మని వనజ పిలిచినా రావొద్దు. వనజతో కూడా చెబుతాను ఎవరినీ పిలవొద్దని. నన్ను ఇలాగే గుర్తుపెట్టుకో... శవంగా కాదు. నా జ్ఞాపకాలు జీవంతో కూడి ఉండాలి. మృత్యువు కూడా ఈ అనంత జీవితయాత్రలో ఒక భాగమేనట. ఆత్మ ఉందంటారుకదా. అదే ఉంటే నా ఆత్మ నీ చుట్టూ తిరుగుతూనే ఉంటుంది నీకు తోడుగా" అంటాడు రవికాంత్ ఆమెకు విమానాశ్రయంలో వీడ్కోలు చెబుతూ.

"రుణానుబంధాలంటారు. ఏనాడో మీకు రుణపడి ఉన్నాను" అంటుంది రాజేశ్వరి.

"ఇలా ప్రతిజన్మలో నాకు రుణపడి ఉంటే జన్మ జన్మకీ ఆరుణాలు తీర్చుకోవడానికి మనం కలుసుకుంటూ ఉండవచ్చు" అంటాడు రవికాంత్. ఇలా అంతమౌతుంది "అనంతం" నవల. మొత్తంమీద ఈ నాల్గు నవలలు పంధొమ్మిదివందల డెబ్బైల నుండి తొంబైల వరకు - దాదాపు మూడు దశాబ్దాల రాజకీయ పరిణామాలను చిత్రిస్తాయి. రాజకీయ పరిణామాలను తప్ప సాంఘిక పరిణామాలను చిత్రించే అవకాశం ఈ నవలలకు లేదు - ఢిల్లీ, సిమ్లా, బెంగుళూరు లాంటి మహానగరాల్లో ఉంటూ ఆర్థికంగానూ, రాజకీయంగానూ బలంగా ఉన్న ఉన్నత వర్గాలవారి సమస్యల్ని ఒక స్త్రీ దృక్కోణంలోంచి చిత్రించే ప్రయత్నం ఈ నవలల్లో జరిగింది.

ఈ నవలలోని పాత్రలన్నీ రాజేశ్వరి చుట్టే తిరుగుతాయి. ఈ నవలలోని ప్రధాన పాత్ర రాజేశ్వరితోపాటు అనంత్, రవికాంత్, డా॥ కరుణాకర్, ధనశ్రీ, గవర్నర్ మూర్తి, అతని భార్య వనజ. ఒక్క "ధన శ్రీ" తప్ప అందరూ మంచివాళ్లే అయితే యే పాత్రలో కూడా పెద్దమానసిక సంఘర్షణ ఉన్నట్టుగా రచయిత్రి చిత్రించలేదు. కాలప్రవాహంలో అందరూ ఈదులాడుతూ వెళ్ళిపోతుంటారే తప్ప దానికి ఎదురీదాలని ప్రయత్నించరు. అందుకే పాత్రల్లో అంతరంగ సంఘర్షణ ఉండదు. అలాగే పాత్రల్లో పెద్ద మార్పు కూడా కనిపించదు. నవల ప్రారంభంలో ఎలా ఉన్నారో నవల పూర్తయ్యేనాటికి కూడా వాళ్ళు అలాగే ఉంటారు. ఈ నాల్గు నవలల్లోనూ రచయిత్రి ఎన్నుకున్న కథా కథన శిల్పాన్ని "నాటకీయ దృష్టి కోణం" అనొచ్చు.

నాటకీయ దృష్టికోణంలో రచయిత పాత్రల్ని మన ముందుంచుతాడే తప్ప తను జోక్యం చేసుకోడు. మొత్తం కథనంతా పాత్రల మధ్య జరిగే సంభాషణల రూపంలో నడిపిస్తాడు. పాత్రలే తప్ప రచయిత ఎక్కడా కనిపించడు. 'నవలాశిల్పం' అన్న పుస్తకాన్ని రచించిన వల్లంపాటి వెంకటసుబ్బయ్య అన్నట్టు "నాటకీయ దృష్టికోణంలో రచయిత కథ జరుగుతున్న చోట స్థిరంగా, కదలిక లేకుండా ఉంచిన కెమేరా వంటివాడు. తన ఎదుట జరుగుతున్న ప్రతి సంఘటనను రికార్డు చేస్తాడు. అంతే కాకుండా అతడు సంఘటన మధ్యలో ఉంచిన టేప్‌రికార్డర్ వంటివాడు కూడా. రికార్డు చెయ్యడమే తప్ప అతడు వ్యాఖ్యానించడు. రచయితకు కథను చూడటానికి ఒక దృష్టికోణం లేదు". (నవలా శిల్పం - పేజి. 54)

కథా కథన శిల్పంలో నాటకీయ దృష్టికోణమే ఉత్తమమైన శిల్ప విధానమని విమర్శకులు నిర్ణయించారు. ఈ శిల్పాన్ని అనుసరించినప్పుడు రచయిత ఒక పాత్ర దృష్టి కోణాన్ని కాకుండా అనేక పాత్రల దృష్టి కోణాల్ని పాఠకుల ముందుంచగల్గుతాడు. అలాగే రచయిత జరుగుతున్న సంఘటనల పట్ల తటస్థంగా కూడా ఉండగలుగుతాడు.

నిష్పాక్షికతను సాధించడం ఈ శిల్ప విధానంలోనే సాధ్యమౌతుంది.

ఈ నాల్గు నవలల్లోనూ రచయిత్రి ఈ నాటకీయ దృష్టికోణం అనే శిల్పవిధానాన్నే అనుసరించింది. సంభాషణలు, పాత్రలు, సంఘటనలే కనిపిస్తాయి తప్ప మధ్య మధ్యలో రచయిత వ్యాఖ్యానాలుగానీ, సుదీర్ఘమైన వర్ణనలు కనిపించవు. రచయిత సృష్టి తప్ప రచయిత కనిపించక పోవడం ఈ శిల్పలక్షణం- ఈ శిల్పలక్షణాలను తన ఈ నవలా చతురస్రంలో రమాదేవి గారు చక్కగా పాటించారనే చెప్పాలి.

ఈ శిల్పంలో రచయిత తటస్థుడుగా ఉండటం, ఎక్కడా జరుగుతున్న సంఘటనల పట్ల రచయితగా తన స్పందనను తెలియజేయకపోవడం వల్ల ఇలాంటి శిల్ప విధానంలో పాఠకులకు కొన్నిసార్లు నిరుత్సాహం, విసుగు కల్గవచ్చు. ఇలాంటి రచనలు ఆవేశం కొరవడిన రచనలుగా కనిపిస్తాయి. ఎన్ని దురాగతాలు జరుగుతున్నా వాటిని చూపిస్తాడే తప్ప వాటి పట్ల రచయిత తన స్పందనను తెలియజేసి పాఠకుల్లో ఆవేశాన్ని కల్గించడేమిటి? అని పాఠకులు అనుకునే అవకాశం ఉంది. ఈ నవలల్లోనూ అదే జరిగింది. నవలల్లోని సంఘటనలన్నీ పాఠకుల్లో ఎలాంటి సంచలనాల్ని కల్గించకుండా ఒకే మార్గంలో సమాంతర సరళరేఖలా సాగిపోతాయి. హెచ్చుతగ్గులుండవు. పాఠకుల్లో రకరకాలైన సంవేదనల్ని కల్గించకుండా వాళ్ళను ఎప్పుడూ ఒకేరకమైన మానసికస్థితిలో - పాఠకునిలో ఒకసారి, సంతోషం, ఒకసారి బాధ, ఒకసారి రౌద్రం లాంటి నవరసాలను ఉద్దీపింపచెయ్యడం కాకుండా- ఎప్పుడూ ఒకే రసాన్ని ఉద్దీపింపజేయడం ఈ నవలల్లో మనకు కనిపిస్తుంది.

నవలారచనలో ఈ నవలా చతురస్రం ఒక గొప్ప ప్రయోగమనే చెప్పాలి. రమాదేవిగారు ఒక్కమాటలో చెప్పినట్టు తనకు తెలిసిన వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆమె అనుభవాల నేపథ్యంలో ఇతివృత్తాన్ని మలచి, పాత్రల్ని కల్పించి ఈ నాల్గు నవలల్ని రచించారు. అయితే ఈ నాల్గు నవలల్లో మొదటి నవల "రాజీ" రూపొందిన స్థాయిలో మిగతా మూడు నవలలు రూపొందలేదని నాకనిపించింది. దానిక్కారణమేమిటంటే ఆ నవలకు 'ఎమర్జెన్సీ' లేక అత్యవసరపరిస్థితి అనే చారిత్రక నేపథ్యం ఉంది. మిగతా నవలలకు అలాంటి నేపథ్యమేదీలేదు. ఒక ఉద్యోగస్తురాలి అనుభవాల్ని సాధ్యమైనంత వాస్తవికంగా చెప్పడంకోసమే ఈ మిగతా మూడు నవలల్ని రచయిత్రి రాశారనిపిస్తుంది. అయితే ఆ అనుభవాల్ని సార్వజనీనం, సార్వకాలీనం చెయ్యడంలో రచయిత్రి విజయవంతం కాలేక పోయింది. ఈ నాల్గు నవలల్లో మొదటి నవల 'రాజీ'కి మాత్రం తెలుగు నవలా సాహిత్యంలో శాశ్వతస్థానం ఉంటుంది.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం తెలుగు అసోసియేషన్ ఆవ్ గ్రేటర్ డెలావేర్ వ్యాలీ (పెన్సిల్వేనియా) వదాన్య సౌజన్యంతో అందించబడింది.